ప్రభాత
తెలుగు దినపత్రిక
jayabheridaily.com
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
సంపుటి : 01
సంచిక : 237
పేజీలు : 5
వెల : 4
మల్కాజిగిరి
శుక్రవారం, 12-04-2024

జయభేరి దినపత్రిక
జయభేరి చానల్లో
నికార్సైన జర్నలిస్టులుగా
నిలబడాలను
కుంటున్నారా..
ఆసక్తి కలిగిన యువతీ
యువకులకు అవకాశం
అనుభవం ఉన్నవారికి
ప్రాధాన్యత
jayabherinews@gmail.com
jayabheridaily.com
+91 9391 544 889



# ఢిల్లీకి రేవంత్

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఢిల్లీకి వెళ్లారు. ఏఐసీసీ పెద్దలతో ఆయన భేటీకానున్నారు. లోక్ సభ ఎన్నికలకు సంబంధించి హైదరాబాద్, ఖమ్మం, కరీంనగర్ స్థానాలు పెండింగ్ లో ఉన్నాయి. ఈ స్థానాల్లో అభ్యర్థుల ఎంపికకు సంబంధించి పార్టీ పెద్దలతో రేవంత్ భేటీ అవుతారు. 14 పార్లమెంట్ నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన కాంగ్రెస్.. మరో మూడు స్థానాలను మాత్రం పెండింగ్లో పెట్టింది. ఖమ్మం, కరీంనగర్ అభ్యర్థులపై హస్తం నేతలు ఒక నిర్ణయానికి రాలేకపోతున్నారు. ఖమ్మం సీటు కాంగ్రెస్లో హాట్ టాపిక్ గా మారింది. ఉమ్మడి ఖమ్మంలో మిత్రపక్షం సీపీఐతో కలిసి అన్ని చోట్ల విజయం సాధించారు. ముగ్గురు మంత్రులు తమ కుటుంబసభ్యులకు టికెట్ కోసం పోటీ పడుతున్నారు. తన తమ్ముడికి టికెట్ ఇస్తే గెలిపించే బాధ్యత తీసుకుంటానని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పార్టీ పెద్దలకి చెప్పినట్టు సమాచారం. ఇక తన సతీమణి నందినికి టికెట్ ఇవ్వాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క హైకమాండ్ను కోరినట్లు తెలుస్తోంది. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తన కుమారుడు యుగంధర్కు ఖమ్మం సీటు ఇవ్వాలని కోరుతున్నారు. సీనియర్ వి.హనుమంతరావు కూడా ఖమ్మం టికెట్ కోసం అధిష్ఠానాన్ని కలిశారు. సామాజిక సమీకరణలో భాగంగా ఎవరికి టికెట్ ఇస్తారనేది పార్టీలో హాట్ టాపిక్ గా మారింది. కరీంనగర్ ఎంపీ టికెట్ విషయంలోనూ కాంగ్రెస్ ఒక క్లారిటీకి రాలేకపోతోంది. కరీంనగర్ అభ్యర్థిగా పోటీ చేయాలని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డిని అధిష్ఠానం కోరగా ఆయన నిజామాబాద్ నుంచి పోటీ చేస్తానని చెప్పడంతో కరీంనగర్ టికెట్ పెండింగ్ లో పడింది. మాజీ ఎమ్మెల్యే ప్రవీణ్ రెడ్డి, పార్టీ నేత వెల్చాల రాజేందర్రావు టికెట్ ఆశిస్తున్నారు. కరీంనగర్లో వెలమ సామాజికవర్గానికి చెందిన ఓట్లు ఎక్కువగా ఉండటంతో..ఆ సామాజిక వర్గానికి చెందిన రాజేందర్ రావు పేరు బలంగా వినిపిస్తోంది. హైదరాబాద్ అభ్యర్థి విషయంలో కూడా కాంగ్రెస్ ఈక్వేషన్స్ మారిపోయాయి. ఇటీవల కాంగ్రెస్కు ఎంఐఎం దగ్గర కావడంతో.. పెద్దగా పోటీ ఇవ్వని బలహీన నేతను దింపాలన్న ఆలోచన చేస్తున్నారు. హిందూ అభ్యర్థిని బరిలోకి దింపితే..మజ్లిస్ రాష్ట్రం మొత్తం మద్దతిస్తుందన్న ఆలోచన చేస్తున్నారు. ఢిల్లీ పర్యటనను ముగించుకుని వచ్చిన తర్వాత రేవంత్ ఎన్నికల ప్రచారాన్ని ముమ్మరం చేయనున్నారు. మొత్తం 17 లోక్ సభ స్థానాల్లో 10కి పైగా స్థానాల్లో విజయం సాధించి సత్తా చాటాలని కాంగ్రెస్ పట్టుదలతో ఉంది.



# కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ..

▸ వ్యక్తిగత కార్యదర్శి పై వేటు

జయభేరి, న్యూ డిల్లీ ఏప్రిల్ 11:

ముఖ్యమంత్రి, ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ కు మరో ఎదురుదెబ్బ తగిలింది. కేజ్రీ వ్యక్తిగత కార్యదర్శి బిభవ్ కుమార్ పై వేటు పడింది. అతని నియామక ప్రక్రియలో నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు డిపార్ట్మెంట్ ఆఫ్ విజిలెన్స్ వెల్లడించింది. ఈ మేరకు బిభవ్ను విధుల నుంచి తొలగించింది. ఈ తొలగింపు తక్షణమే అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు విజిలెన్స్ స్పెషల్ సెక్రటరీ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.విధుల్లో ఉన్న ఓ ప్రభుత్వ ఉద్యోగిపై దాడి చేశాడని బిభవ్పై 2007లో నోయిడా పోలీసులు కేసు నమోదు చేసినట్లు విజిలెన్స్ అధికారులు తమ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అతడు కేజ్రీవాల్కు పర్సనల్

...మిగతాది 2 లో

# జల్లెడ పడుతున్న బలగాలు

▸ ఆకుల్లా రాలిపోతున్న మావోయిస్టులు



జయభేరి, వరంగల్, ఏప్రిల్ 11 :

అసలే వేసవి కాలం, మరోవైపు లోక్సభ ఎన్నికలు... మరోవైపు అడవిని జల్లెడ పట్టేస్తున్న భద్రతా బలగాలు.. మొత్తానికి మావోయిస్టులకు పెద్ద చిక్కే వచ్చి పడింది. అందుకే నెల రోజులుగా అడవిలో తుపాకుల మోత పెరుగూ వస్తోంది. ఇది మావోయిస్టులకు కోలుకొని దెబ్బ తీస్తోంది. వరుస ఎన్కౌంటర్లతో దళాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. నెలరోజుల వ్యవధిలో తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని మహారాష్ట్ర ఛత్తీస్గఢ్లో నాలుగు ఎన్కౌంటర్లు జరిగాయి. ఎండాకాలం వచ్చిందంటే చాలు మావోయిస్టులకు గడ్డుకాలం మొదలైనట్టే. ఆకు రాలే కాలాన్ని అనుకూలంగా మార్చుకునే భద్రతా సిబ్బంది వేట మొదలు పెడుతుంటారు. అందులో ఎన్నికల సీజన్ కూడా కలిసి వచ్చింది. అందుకే వరుస ఎన్కౌంటర్లతో పచ్చని అడవి నెత్తుటి రంగును పూసుకుంటోంది. మావోయిస్టులను అంతమొందించడానికి భద్రతా బలగాలు వేసవిని ఉపయోగించుకుంటున్నాయి. దీనికి తోడు ఆధునిక టెక్నాలజీ కూడా వారికి మరింత సాయం చేస్తోంది. గూగుల్ మ్యాప్, శాటిలైట్, డ్రోన్ల వ్యవస్థతో గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న మావోయిస్టులపై ఉక్కు పాదం మోపుతున్నారు. అందుకే ఆకు రాలుతున్నట్టు మావోయిస్టులు నెలరాలుతున్నారు. వేసవికాలం మావోయిస్టులకు కలిసి రాని కాలం. మావోయిస్టులకు పచ్చని అడవులు షెల్టర్ జోన్లు. అడవి ఎంత పచ్చగా ఉంటే మావోలు అడవుల్లో అంత బలంగా ఉంటారు. వేసవి కాలంలో పచ్చని అడవి ఆకురాల్చి ఎడారిగా మారుతుంది. దీంతో మావోలకు సురక్షితమైన షెల్టర్ జోన్లు లేకుండా పోతాయి. మావోలు ఎక్కువగా నీటి మీద ఆధారపడి ఉంటారు. వేసవికాలం కావడంతో అడవుల్లో నేటికుంటలు, చెలిమలు ఎండిపోతాయి. దీంతో మావోయిస్టులు నీటి గోదావరి పరివాహక ప్రాంత వాగుల వెంట రాకతప్పదు. అంతేకాకుండా సేఫ్ జోన్లకు వెళ్ళడానికి రాష్ట్రాల సరిహద్దులు దాటాల్సి వస్తుంది.మావోయిస్టుల ఏరివేతకు

...మిగతాది 2 లో




# రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ లాగా తయారయ్యారు

▸ నా జీవితాంతం కొట్లాటే.. కొట్లాడుతూనే ఉంటా... ఈటల రాజేందర్

జయభేరి, మెదక్ :

మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బూత్ అధ్యక్షుల సమావేశంలో మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్ రావుతో కలిసి పాల్గొన్న ఈటల రాజేందర్. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ.. నినాదాలుకే పరిమితం కాకుండా అవి ఆచరించి చూపించే బాధ్యత మన మీద ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో మంచి వాతావరణం ఉన్నప్పటికీ గోల్మాల్ చేసి, తిమ్మిని బొమ్మ చేసి సోషల్ మీడియాలో, మీడియాలో వందల కోట్ల రూపాయల ఖర్చుపెట్టి అబద్ధాన్ని అసత్యాన్ని నమ్మించి ఏం పని చేయకుండానే ముఖ్యమంత్రి పదవిని దక్కించుకున్నాడు రేవంత్ రెడ్డి. దేశమంతా ఈసారి ఆప్ కీ బార్ చార్ సౌ పార్ అంటున్నారు. ఇది ప్రజా నినాదం. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గంలో అన్ని అసెంబ్లీలలో బీఆర్ఎస్ ఏ గెలిచింది, బిజెపికి ఎన్ని ఓట్లు వచ్చాయని అంటున్నారు...

...మిగతాది 2 లో



# కవితకు మరో షాక్

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 11:

ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు మరో షాక్ తగిలింది. మనీ లాండరింగ్ కు సంబంధించి ఈడీ కేసులో ఇప్పటికే ఆమె తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నారు. తాజాగా, కవితను గురువారం ఈ కేసులో సీబీఐ అరెస్ట్ చేసింది. కాగా, లిక్కర్ కేసుకు సంబంధించి కవితను ప్రశ్నించేందుకు సీబీఐ అధికారులు కోర్టును ఆశ్రయించగా.. న్యాయస్థానం అందుకు అనుమతి ఇచ్చింది. దీంతో ఈ నెల 6న కేంద్ర దర్యాప్తు సంస్థ ఆమెను ప్రశ్నించింది. ఇదే కేసులో గతంలో ఆమెను సీబీఐ ప్రశ్నించింది. తాజాగా

...మిగతాది 2 లో

# బీజేపీ దూకుడు.. ఆపరేషన్ లో కాంగ్రెస్

జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 11:


త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో ఎంఐఎం పార్టీ సంగతి పక్కన పెడితే మిగతా మూడు పార్టీల్లో మూడు విభిన్నమైన దృశ్యాలు కనిపిస్తున్నాయి.కేంద్రంలో హ్యాట్రిక్ విజయం సాధించాలనే ఉత్సాహంలో ఉన్న బీజేపీ శ్రేణులు గ్రేటర్ ప్రచార పర్వంలోనూ దూసుకెళ్తు మిగతా వారి కంటే ముందంజలో ఉన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని చేవెళ్ల,సికింద్రబాద్,హైదరాబాద్ మరియు మల్కాజిగిరి లోక్ సభ స్థానాలకు అందరికంటే ముందే అభ్యర్థులను ప్రకటించడంతో వారు ఇప్పటికే ప్రచారాలు ప్రారంభించారు.ప్రజలకు అందరి కంటే ముందే దగ్గరయ్యే ప్రయత్నాలు చేస్తున్నారు.జాతీయ స్థాయిలో వెలిగిపోతున్న ప్రధాని మోడీ ప్రభను ప్రజలకు వివరిస్తూ దేశం కోసం చేసిన కార్యక్రమాలను ప్రజలకు చెబుతున్నారు. ప్రధాని మోడీ,కేంద్ర మంత్రి అమిత్ షా లు ఇప్పటికే ఓ రౌండ్ రాష్ట్రంలో పర్యటించగా... ఈనెల 13 తరువాత మరో దఫా పర్యటించనున్నారు. రాష్ట్రంలో డజన్ సీట్లు గెలుపు లక్ష్యంలో భాగంగా.....గ్రేటర్ పరిధిలోని



ఆ నాలుగు సెగ్మెంట్లలో కనీసం మూడు స్థానాల్లో కాషాయ జెండా ఎగరువేయాలని యోచిస్తోంది.

నియోజకవర్గాల వారీగా బీజేపీ ప్రచారం జోరుగా సాగుతోంది. ఒకసారి నోటిఫికేషన్ వెలువడ్డకా.. బీజేపీ దుకూడు మరింత పెంచనుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. బూటకపు గ్యారంటీ లంటూ అధికార కాంగ్రెస్ పై బీజేపీ విమర్శలు గుప్పిస్తుంది. ఇక బిఆర్ఎస్ హయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ లను సైతం బీజేపీ అస్త్రంగా మలచుకొని గులాబీ నేతలు పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు.పాదయాత్రల తో ఇంటింటి ప్రచారం ఇప్పటికే ప్రారంభించింది.సాధారణ ప్రచారం కంటే సోషల్ మీడియా పవర్ ఎక్కువైనందున ప్రతి రోజూ తప్పనిసరిగా కొన్ని పోస్టులు ఉండేలా బీజేపీ సోషల్ మీడియా విభాగం చర్యలు తీసుకుంటుంది.హైదరాబాద్ పార్లమెంట్ లో వరుసగా నెగ్గుతూ వస్తున్న మజ్లిస్ పై పోటీకి హిందూ ధర్మ సంరక్షణ,సంఘ నేపథ్యం కంపెల్లి మాధవి లత ను బీజేపీ నిలబెట్టింది. ఇటీవలే " అప్ కి అదాలత్ " ఇంటర్వ్యూ లో ఆమె ఇచ్చిన సమాధానాలు అసాధారణమైనవని,

...మిగతాది 2 లో



# వారంలో మొదటి దశ ఎన్నికలు

జయభేరి, న్యూఢిల్లీ, ఏప్రిల్ 11:

2024 లోక్సభ ఎన్నికల తొలి విడతలో 102 నియోజకవర్గాలకు ఏప్రిల్ 19న 1,625 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలో కేవలం 134 మంది మాత్రమే మహిళలు ఉండటం గమనార్హం. అంటే.. ఇది 8శాతం మాత్రమే. లోక్సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మహిళలకు 33% సీట్లు రిజర్వ్ చేసే మహిళా

...మిగతాది 2 లో

▶▶ మొదటిపేజీ తరువాయి

## కేజ్రీవాల్ కు ఎదురుదెబ్బ..

సెక్రటరీగా నియమించే సమయంలో ఈ కేసు వివరాలను వెల్లడించలేదని విజిలెన్స్ విభాగం దర్యాప్తులో వెల్లడైనట్లు తెలిపింది. ఈ నియామకంలో అవకతవకలు జరిగాయని గుర్తించినట్లు పేర్కొంది. పాలనావ్యవహారాల పరంగా ఇది ఇబ్బందికర పరిణామం అని, ఎలాంటి ముందస్తు వెరిఫికేషన్ లేకుండా మంత్రుల వ్యక్తిగత సిబ్బందిని నియమించడం సరికాదని విజిలెన్స్ విభాగం తెలిపింది. బిభవ్పై నమోదైన అభియోగాలు తీవ్రమైనవని, వాటిపై విచారణ జరుపుతున్నట్లు వెల్లడించింది.ఇదిలా ఉండగా..ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో బిభవ్ కుమార్ను ఈడీ అధికారులు సోమవారం విచారించిన విషయం తెలిసిందే. మనీలాండరింగ్ యాక్ట్ కింద అతడి స్టేట్మెంట్ను ఈడీ రికార్డు చేసింది. ఈడీ విచారణ అయిన మూడు రోజులకే బిభవ్ను విధుల నుంచి తొలగించడం గమనార్హం.బిభవ్పై వేటు వేడయంపై ఆమ్ ఆద్మీ పార్టీ స్పందించింది. ఈ మేరకు బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించింది. తమ పార్టీని అన్ని విధాలా దెబ్బతీసేందుకు కుట్ర పన్నుతోందని ఆరోపించింది. తొలుత తప్పుడు కేసులో సీఎం కేజ్రీవాల్ను అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇప్పుడు కేజ్రీవాల్ వ్యక్తిగత కార్యదర్శి సహా ఆయన సిబ్బంది మొత్తాన్ని తొలగించే పనిలో పడ్డారని మండిపడింది.

## కవితకు మరో షాక్

కవితను కస్టడీలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించింది. లిక్కర్ స్కాం కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తో కలిసి ఆమె కుట్రలు పన్నారని సీబీఐ ఆరోపించింది. ఈ క్రమంలో కవితను జ్యుడీషియల్ కస్టడీ నుంచి సీబీఐ హెడ్ క్వార్టర్స్ కు తరలించనున్నారు. మరోవైపు, కవిత రెగ్యులర్ పిటిషన్ పై ఈ నెల 16న విచారణ జరగనుండగా.. తాజాగా సీబీఐ కస్టడీలోకి తీసుకోవడం సంచలనంగా మారింది. లిక్కర్ స్కాంకు సంబంధించి మనీ లాండరింగ్ కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితన మార్చి 15న ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు. ఆ తర్వాత ఆమెను ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టులో హాజరుపరచగా.. కోర్టు మార్చి 26 వరకూ ఈడీ కస్టడీకి అప్పగించింది. అనంతరం కస్టడీ గడువు ముగియడంతో కోర్టు కవితకు జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆమెను తీహార్ జైలుకు తరలించారు. రెండు రోజుల క్రితం మళ్లీ కోర్టులో హాజరు పరచగా.. ఆమె జ్యుడీషియల్ కస్టడీని మరో 14 రోజులు పొడిగించింది. దీంతో ఆమె ఈ నెల 23 వరకూ తీహార్ జైలులోనే ఉండనున్నారు. మరోవైపు, కవిత రెగ్యులర్ బెయిల్ పిటిషన్ పై ఈ నెల 16న విచారణ జరగనుంది.ఢిల్లీ లిక్కర్ స్కాం కేసులో రోజుకో కీలక పరిణామం చోటు చేసుకుంటోంది. తనకు మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత దాఖలు చేసిన పిటిషన్ ను రౌస్ అవెన్యూ కోర్టు ఈ నెల 8న కొట్టేసింది. చిన్న కుమారుడికి పరీక్షలు ఉన్నందున ఈ నెల 16 వరకూ మధ్యంతర బెయిల్ ఇవ్వాలని కవిత పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ పై విచారణ జరిపిన న్యాయస్థానం.. ఏప్రిల్ 4న తీర్పును రిజర్వ్ చేసింది. అనంతరం ఈ నెల 8న (సోమవారం) దీనిపై తీర్పు వెలువరించింది. ఇక, ఈ కేసుకు సంబంధించి సీబీఐ అధికారులు కవితను గతంలోనే హైదరాబాద్ లో విచారించారు. ఈడీ కేసులో తీహార్ జైలులో ఉన్న అనంతరం ఆమెను కోర్టు అనుమతితో ఈ నెల 6న ప్రశ్నించారు. తాజాగా, ఆమెను తీహార్ జైలు నుంతి తమ కస్టడీలోకి తీసుకున్నారు.

## వారంలో మొదటి దశ ఎన్నికలు

బిల్లుకు 2023 సెప్టెంబర్లో ఆమోదం లభించినప్పటికీ.. అది అమల్లోకి వచ్చేంత వరకు క్షేత్రస్థాయిలో పెద్దగా మార్పులు కనిపించే అవకాశం లేదని ఇది స్పష్టం చేస్తోంది.2019 లోక్సభ ఎన్నికల్లో మొత్తం అభ్యర్థుల్లో 9 శాతం (726) మంది మహిళలు ఉన్నారు. వీరిలో కేవలం 78 మంది మాత్రమే 17వ లోక్సభకు ఎంపికయ్యారు.ఇక ఇప్పుడు.. తొలి దశలో తక్కువ మంది మహిళా అభ్యర్థులు కనిపిస్తున్నారు. మహిళా అభ్యర్థులను నిలబెట్టడానికి రాజకీయ పార్టీలు తొందరపడటం లేదని భారత ఎన్నికల సంఘం విడుదల చేసిన తాజా గణాంకాల ద్వారా స్పష్టమవుతోంది.21 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో మిజోరం, అండమాన్ నికోబార్ దీవుల్లో వరుసగా 16 శాతం మహిళా అభ్యర్థులు ఉన్నారు. మరోవైపు, మణిపూర్, నాగాలాండ్, లక్షద్వీప్, ఛత్తీస్గఢ్, త్రిపుర, జమ్ము కాశ్మీర్ సహా ఆరు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని పార్టీలు ఒక్క మహిళా అభ్యర్థిని నిలబెట్టలేదు.ఇతర రాష్ట్రాలు /కేంద్రపాలిత ప్రాంతాల్లో.. అరుణాచల్ ప్రదేశ్ 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఒక మహిళా అభ్యర్థిని మాత్రమే నిలబెట్టింది. ఇతర రాష్ట్రాల్లో మహిళా అభ్యర్థుల సంఖ్య.. బిహార్ 3, మధ్యప్రదేశ్ 7, మహారాష్ట్ర 7, మేఘాలయ 2, పుదుచ్చేరి 3, రాజస్థాన్ 12, సిక్కిం 1, ఉత్తర ప్రదేశ్ 7, ఉత్తరాఖండ్ 4, పశ్చిమ బెంగాల్ 4.లోక్సభ ఎన్నికల మొదటి దశలో తమిళనాడులో అత్యధికంగా 950 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. వీరిలో 76 మంది మహిళలు ఉన్నారని ఈసీ గణాంకాలు చెబుతున్నాయి.

ఇదిలా ఉండగా ఏడీఆర్ నివేదిక ప్రకారం.. 2024 లోక్సభ ఎన్నికల తొలి దశలో బరిలో దిగుతున్న వారిలో 252 మంది.. తమపై క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. వీరిలో 161 మంది 'తీవ్రమైన' క్రిమినల్ కేసులు ఉన్నట్లు ప్రకటించారు. ఈ లిస్ట్ కేవలం తొలి దశ పోలింగ్కు సంబంధించినదే కావడం గమనార్హం. మిగిలిన 6 దశల్లో.. క్రిమినల్ కేసులున్న అభ్యర్థుల సంఖ్య ఎలా ఉంటుందో చూడలి.ఏప్రిల్ 19తో పాటు ఏప్రిల్ 26, మే 7, మే 13, మే 20, మే 25, జూన్ 1 తేదీల్లో లోక్సభ ఎన్నికలు జరగనున్నాయి. జూన్ 4న ఓట్ల లెక్కింపు ప్రక్రియ ఉంటుంది.

## రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ లాగా తయారయ్యారు

2018 లో టిఆర్ఎస్ పార్టీకి ఎమ్మెల్యేలకు వచ్చిన మెజారిటీ 4 లక్షల పైచిలుకు, నాలుగు నెలలకే మళ్ళీ పార్లమెంట్ ఓట్లు వస్తే కరీంనగర్ జిల్లాలో నాలుగున్నర లక్షల ఓట్లు గల్లంతయ్యి లక్ష ఓట్ల మెజారిటీతో గెలిచిన ఘనత మన ముందే ఉంది. శాసనసభకు జరిగే ఎన్నికల్లో ఆలోచన వేరే ఉంటదని, పార్లమెంట్ కు జరిగే ఎన్నికల్లో ఆలోచనలో వేరే ఉంటదని అర్థం అయిపోయింది. 17 స్థానాలలో ఆదిలాబాద్ నుండి అలంపూర్ వరకు, భద్రాచలం నుంచి పరిగి వరకు ఎక్కడ కదిలించిన, ఎవరితో మాట్లాడిన తప్పకుండా ఓటు పడేది బిజెపికే అంటున్నారు. తెలంగాణలో బిజెపి నాయకులు గానీ, కార్యకర్తలు గాని ఒక గొప్ప వరం ఏంటంటే... ఏ ఇంటికి పోయిన చాయ్ తాగు బిడ్డ తప్పకుండా మీకే ఓటేస్తామంటున్నారు. తెలంగాణ వ్యాప్తంగా ఒక సర్వే చేయించాం.. ఈ దఫా ఎన్నడూ ఓటు వేయని వారు, రాజకీయం అంటే ఇష్టం లేనివారు, నాయకుల పట్ల మంచి అభిప్రాయం లేని వారు, ఈసారి మాత్రం ఓటు మోదీ గారికి వేయాలనుకుంటున్నారు. ఏ పార్టీకైనా పదేళ్లు పరిపాలిస్తే వ్యతిరేకత ఉండాలి.. కానీ ప్రజలు ఈసారి మాత్రం భారతీయ జనతా పార్టీకి ఒంటరిగా 370 సీట్లు, ఎన్ డి ఏ కి 400 సీట్లు ఇవ్వాలని అనుకుంటున్నారు. అందులో తెలంగాణ నుండి 12 సీట్లు వస్తాయని అన్ని సర్వే సంస్థలు చెబుతున్నాయి. పిట్టలదొర చెప్పినట్టు కహానీలు చెప్పి.. నాకు ఓటేయండి, ప్రమాణ స్వీకారం చేస్తా తెల్లారే అన్నిటిపై సంతకాలు పెడతా అన్నారు. ఇచ్చిన హామీలు నెరవేర్చకుంటే తప్పకుండా వెంటపడతాం. నేను మాట్లాడుతుంటే ముఖ్యమంత్రి ఒంటి కాలు మీద లేస్తున్నాడంట.. నా జీవితాంతం కొట్లాటే, కొట్లాడుతూనే ఉంటా. ప్రాజెక్టులలో అక్కడక్కడ నీళ్లు ఉన్నప్పటికీ... మేనేజ్మెంట్ చేయడంలో విఫలమై మొట్టమొదటిసారిగా పంటలు ఎండిపోయాయి. రేవంత్ రెడ్డి కూడా కేసీఆర్ లాగా తయారయ్యారు. రఘునందన్ రావు లాంటివాడిని, ఈటల రాజేందర్ లాంటివాడిని ఎట్లా ఓడ కొట్టాలి.. కెసిఆర్ లాగానే నాయకులకు వెలగట్టాలి వాళ్లని పార్టీలో జాయిన్ చేసుకోవాలి, మమ్మల్ని ఓడించాలి. నేను పుసుక్కున లంకె బిందెలు ఉన్నాయని ముఖ్యమంత్రి అయిన.. ఇక్కడ అన్ని ఖాళీ బిందెలే ఉన్నాయి అంటున్నాడు. కెసిఆర్.. మిషన్ భగీరథ ఓపెన్ చేసినాడు మోడీ మీ అంత గొప్ప నాయకుడు ఎవరూ లేరు, ఎక్కడ కూడా కరప్షన్ లేకుండా గవర్నమెంట్ నడుపుతున్నారు... మీ ఆశీర్వాదం తెలంగాణ కావాలి అని కోరారు. ఆ తర్వాత మోడీని ఎన్నెన్ని మాటలు అన్నారో మీకు తెలుసు. అదే తరహాలో ఇప్పుడున్న ముఖ్యమంత్రి మోడీ తెలంగాణకు వస్తేమా పెద్దన్న అని సంబోధించారు. వెలిగే లైట్, పెరిగే పచ్చటి మొక్కలు, వేస్తున్న సిమెంట్ రోడ్లు, కడుతున్న మోరీలు అన్ని మోడీ ప్రభుత్వం ఇచ్చినవే. కానీ ఎన్నడు మోడీ నేను ఇచ్చిన అని చెప్పుకోరు. 1947 2014 వరకు ఎన్ని కిలోమీటర్ల నేషనల్ హైవేస్ వేశారో... ఈ పదేళ్లలోనే అన్ని కిలోమీటర్లు వేసిన ఘనత మోడీది. మోడీ మతోన్మాది, ముస్లిం వ్యతిరేకత వాది అన్నవారికి ఆయన పని విధానమే సమాధానం.. ఇప్పుడు మోడీ ముస్లిం దేశాలకు అతి పెద్ద మిత్రుడు. మతం ప్రజలు ఇబ్బంది పెట్టే పని చేయదు, కానీ 25 ఏళ్లుగా కలిసి ఉన్న భార్యాభర్తలు చిన్న కోపం వస్తే త్రిపుల్ తలాక్ పేరుతో విడాకులు ఇచ్చి పోతే.. పిల్లల్ని వదిలిపెట్టి ఆ తల్లి, భర్తని వదిలి పెట్టిన ఆడబిడ్డ ఆమె వేదన అంతా ఇంతా కాదు. దీనిని ఏ స్త్రీ కూడా అంగీకరించరు. అలాంటి ముస్లిం మహిళలకు త్రిబుల్ తలాక్ రద్దుచేసి, వాళ్లు పడే వేదన దూరంచేసి వాళ్ల గుండెల్లో చోటు సంపాదించుకున్న బిడ్డ మోడీ. ఈ డయాస్ మీద మీకు నాయకులు కనిపిస్తుంటారు కానీ కనబడకుండా పనిచేసేది కార్యకర్తలే.. మీరు లేకుండా సర్పంచులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు గెలవరు. కాబట్టి కష్టపడి అందరూ కృషి చేసి పార్టీని.. రఘునందన్ రావును గెలిపించాలని కోరుకుంటున్నాను.

# ఖమ్మం కాంగ్రెస్ లో కొత్త ముఖం

✍ జయభేరి, ఖమ్మం, ఏప్రిల్ 11:



మొన్నటి అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ ముగ్గురికి కీలక పదవులను దక్కాయి. రాష్ట్ర రాజకీయాల్లో వారు ఇప్పుడు "కీ"రోల్ పోషిస్తున్నారు. ఒకే జిల్లాకు చెందిన నేతలైనప్పటికీ కేబినెట్ లో ఆ ముగ్గురికి దక్కిన అరుదైన గౌరవం మరెవరికీ దక్కలేదు. అయినా సరే ఆ ముగ్గురూ అధిష్టానం దగ్గర మరింత అత్యాశపడ్డారు. తమ కుటుంబ సభ్యులకు పదవి కావాలని పాకులాడారు. ఈ పరిణామాన్ని నిశితంగా గమనించిన కాంగ్రెస్ అధిష్టానం మెల్లగా ఆ ముగ్గురికీ చురక వేసింది. మీకు ఇక "నో ఛాన్స్" అంటూ సున్నితంగానే చేయిచ్చింది.గత కొంత కాలంగా ఖమ్మం పార్లమెంటు స్థానం అందరి నోళ్లలోనూ హాట్ టాపిక్ గా మారింది. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులు తమ వారి కోసం పాకులాడటమే ఇందుకు ప్రధాన కారణంగా మారింది. రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నేతలుకుసుమ కుమార్, వి.హనుమంతరావు సైతం ఈ టిక్కెట్ కోసం పోటీ పడుతున్న నేపథ్యంలో ఈ టిక్కెట్ కు మరింత పోటీ పెరిగింది. అయితే కేబినెట్ లో కీలక పదవులు అనుభవిస్తూ మళ్లీ తమ కుటుంబ సభ్యులకు పదవులు కావాలని పోటీ పడిన ముగ్గురు మంత్రుల వ్యవహారం విమర్శలకు దారితీసింది. ఎంతో సున్నితమైన ఈ అంశాన్ని కాంగ్రెస్ అధిష్టానం సునిశితంగా పరిశీలించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు స్పష్టమవుతోంది. మంత్రుల కుటుంబ సభ్యులెవరికీ ఖమ్మం ఎంపీ టిక్కెట్ ఇచ్చే ప్రసక్తిలేదని అధిష్టానం ఎట్టకేలకు తేల్చి చెప్పినట్లు తెలుస్తోంది.ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ సతీమణికి టిక్కెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అలాగే రెవెన్యూ మంత్రి పొంగులేటితన సోదరుడు ప్రసాద్ రెడ్డికి టిక్కెట్ ఇప్పించుకునే ప్రయత్నాలు చేశారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం తన కుమారుడు యుగంధర్ కి టిక్కెట్ కావాలని పట్టుపట్టారు. కాగా అధిష్టానం పెద్దలు వీరు మినహా వేరే పేర్లు సూచించాలని కోరినట్లు వినికిడి. దీంతో ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లగుల్లాలు పడుతున్నట్లు తెలిసింది. ముగ్గురు మంత్రులతో అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు ఆయన ఆంతరంగికులు సైతం చర్చలు జరిపినట్లు సమాచారం. ఈ ఫలితంగా ఇప్పటి వరకు ఒకరికొకరు తీవ్రంగా పోటీ పడిన ఈ ముగ్గురు అమాత్యులు అనివార్యంగా పోటీ నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు స్పష్టమవుతోంది.తీవ్రమైన పోటీ నెలకొన్న ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ రేసులో ఏకంగా ముగ్గురు మంత్రులు పోటీ నుంచి తప్పుకోవడంతో తిరిగి మిగిలిన ఆశావహుల ఆశలు ఊపిరి పోసుకున్నాయి.

ఇక ఎవరికి వారుగా తమ ప్రయత్నాలను యథావిధిగా మొదలుపెట్టారు. జిల్లాకు చెందిన మంత్రులను తమ ప్రయత్నాలను విరమించుకోవాలని చెప్పిన ఏఐసీసీ వారినే ఎంపీ అభ్యర్థిని సూచించాలని కోరడం గమనార్హం. దీంతో మంత్రులు అయోమయంలో పడ్డారు. ఖమ్మం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ భారీ ఆధిక్యంతో విజయం సాధించింది. కాగా బీఆర్ఎస్ సిట్టింగ్ అభ్యర్థి నామా నాగేశ్వరరావునే తిరిగి బరిలో నిలపగా, బీజేపీ వినోద్ రావుకు టిక్కెట్ ఇచ్చింది. అయితే ఎవరెన్ని అంచనాలు వేసుకున్నా ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఈ సీటును అత్యంత సులువుగా గెలుచుకోగలుగుతుందని నిపుణులు అంచనా. ఈ అనుకూల పరిస్థితి క్రమంలో టిక్కెట్ ఎవరికి దక్కుతుందన్న ఆసక్తి ఇప్పుడు మరింతగా పెరిగింది. ఇటీవల హైదరాబాద్ తుక్కుగూడలో జరిగిన జన జాతర సభకు వచ్చిన రాహుల్ గాంధీబస చేసిన హోటల్ కు జిల్లా నేతలను పిలిచి ఖమ్మం టికెట్ విషయంపై క్లారిటీ ఇచ్చినట్లు సమాచారం. కాగా గత నెల 31వ తేదీన ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ సమావేశంలో ఖమ్మం సీటు విషయంపై జరిగిన చర్చల్లో ఇద్దరు పేర్లు వచ్చినప్పటికీ వారిని పక్కన పెట్టారని తెలుస్తోంది. దీంతో కొత్త వారి కోసం అన్వేషణ ప్రారంభించారని సమాచారం. అయితే ఇప్పటికే కొందరు ఆశావహులు మళ్ళీ తమ ప్రయత్నాలు ప్రారంభించారు. వారిలో వంకాయలపాటి రాజా, జట్టి కుసుమ కుమార్, రఘురాంరెడ్డి ఉన్నారు. కాంగ్రెస్ లో చాలా కాలంగా పని చేస్తూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో పాలేరు టికెట్ ఆశించి భంగపడిన రాయల నాగేశ్వరరావు, మువ్వా విజయబాబు, మహమ్మద్ జావీద్ లాంటి వారు కూడా మంత్రుల కుటుంబ సభ్యులకు ఇవ్వకుంటే తమకు ఇవ్వాలని కోరుతున్నారు. మొత్తానికి ఖమ్మం లోక్ సభకు కాంగ్రెస్నుంచి ఎవరు అభ్యర్థి అవుతారో అనే విషయం అతి పెద్ద ఫజిల్ గా మారింది.

## యాదాద్రిలో వరుస దొంగతనాలు

✍ జయభేరి, యాదాద్రి:

యాదాద్రి భువనగిరి జిల్లాలో వరస దొంగతనాలతో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు..డిచిన ప్రతి రోజుల్లోనే 8 దొంగతనాలు జరిగాయి. మోట కొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో భవనం పై నిద్రిస్తున్న మహిళ మెడలో నుండి మూడున్నర తులాల పుస్తెలతాడును ఎత్తుకెళ్లారు. సంఘటన స్థలానికి చేరుకున్న డిసిపి రాజేష్ చంద్ర. త్వరలోనే దొంగలను పట్టుకుంటామని తెలిపారు.. గడిచిన 10 రోజుల్లో 8 దొంగతనాలు జరిగాయి ఆలేరు బోనగిరి మోటకొండూరు బీబీనగర్ ప్రాంతాల్లో దొంగతనాలు ఎక్కువగా జరుగుతున్నాయి.. భువనగిరి మండలం చీమల కొండూరు నాగిరెడ్డిపల్లి బోనగిరి టౌన్ లో దొంగతనాలు జరిగాయి.. ఆలేరు పట్టణంలో మరియు మూటకొండూరు మండలం కాటేపల్లి గ్రామంలో దొంగతనాలు జరిగాయి.. ఆరు బయట నిద్రిస్తున్న మహిళలే టార్గెట్గా చేస్తూ రోజు కొత్త రకాలు దొంగతనాలు చేస్తున్నారు దొంగతనం చేసి వెళ్లే వరకు కూడా అక్కడ నిద్రిస్తున్న వారికి కూడా కనీసం స్పృహ లో లేకుండా ముందస్తుగా వారు ప్రయత్నాలు చేస్తున్నారు.. లీసులు పదేపదే గ్రామాల్లో డప్పు చాటింపులు చేసిన ఆరుబయట నిద్రించడంతో వరుస దొంగతనాలు జరుగుతున్నాయని అంటున్నారు పోలీసులు స్థానికుల మద్దతు కూడా పోలీసులకు కావాలని దొంగతనాలను అరికట్టాలంటే గ్రామాల్లో నిఘా ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు..



## ఎండోమెంట్ సెల్ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్

✍ జయభేరి, మేడ్చల్ జిల్లా :

భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ (ఐటీ సెల్ సోషల్ మీడియా ప్రోగ్రాం కోఆర్డినేటర్) గా ఫణిభూషణ్ చింతపల్లి ని నియమిస్తూ కన్వీనర్ సూర్య ప్రకాష్ అన్నావజ్జుల నియామక పత్రాన్ని జారీ చేయగా, బీజేపీ మాజీ ఎమ్మెల్సీ రామచందర్ రావు చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఫణి భూషణ్ మాట్లాడుతూ.. బిజెపి పార్టీ నుండి ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) తెలంగాణ స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గా తనకు బాధ్యతలు అప్పగించినందుకు ఎండోమెంట్ సెల్ (ధార్మిక పరిషత్) రాష్ట్ర కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతలను క్రమశిక్షణ చిత్తశుద్ధి అంకితభావంతో బిజెపి పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయిలో కృషి చేస్తానని అన్నారు.

## బీజేపీ దూకుడు.. ఆపరేషన్ లో కాంగ్రెస్

తర్కంతో మాట్లాడడమే కాక దృఢమైన అంశాలు ప్రస్తావించారని స్వయన మోదీ )ఎక్స్ వేదికగా పోస్టు చేశారు. దీంతో ఆమె ఎవరో తెలుసుకోవాలన్న ఆసక్తి నగర ప్రజల్లో పెరిగింది.వివిధ అంశాల్లో బీజేపీ మిగతా పార్టీల కంటే కాస్త ముందజలో ఉందని చెప్పాలి.పదేళ్ల పాటు ఓ వెలుగు వెలిగిన బీఆర్ఎస్ పార్టీ గత అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలు కావడం,పార్టీ దళపతి కేసిఆర్ కాలు విరగడం,ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ అవడం మరియు సంచలనం రేపుతున్న ఫోన్ ట్యాపింగ్,నేతల జంపింగ్ తదితర అంశాలు పార్టీని పార్టీ శ్రేణులను,కార్యకర్తలను కోలుకోకుండా చేస్తున్నాయి. ఇవన్ని కుట్రలు అని,రాజకీయ కక్ష సాధింపు చర్యలు అని కేటీఆర్ తిప్పి కొడుతున్న..... పార్టీ శ్రేణుల్లో మాత్రం నైరాశ్యం తగ్గడం లేదు.పార్టీ అభ్యర్థులను ఎంతో ముందస్తుగా ప్రకటించిన చరిత్ర ఉన్న ఆ పార్టీ ప్రస్తుతం అభ్యర్థుల కరువుతో ఉంది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో నేతలు పోటీ చేసేందుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదు.పిలిచి టికెట్ ఇస్తామన్న నేతలు నిరకరిస్తున్నారట...! డబ్బు,ప్రచారం అంతా పార్టీనే చూసుకుంటుందని చెబుతున్నా నేతలు నో అంటే నో అంటున్నారట...! సికింద్రాబాద్ నుంచి పోటీకి మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ససేమిరా అనడంతో పద్మారావు ను బరిలో దింపారు గులాబీ బాస్.ఇక చేవెళ్ల సిట్టింగ్ బిఆర్ఎస్ ఎంపిగా ఉన్న రంజిత్ రెడ్డి ఆ పార్టీకి హ్యాండ్ ఇచ్చి హస్తం గూటికి చేరుకున్నారు.దాంతో అక్కడ టీడీపీ వలస నేత కసాని జ్ఞానేశ్వర్ ను బరిలో దింపారు. ఇక మల్కాజిరి నుంచి మొదట మాజీ మంత్రి మల్లా రెడ్డి కొడుకు భద్ర రెడ్డి పోటీలో ఉంటారని ప్రచారం జరిగినా.....ఆ తరువాత జరిగిన పరిణామాల నేపథ్యంలో ఆయన పోటీ నుంచి తప్పుకున్నారు.దీంతో రాగిడి లక్షమా రెడ్డి అక్కడి నుంచి పోటీలో ఉన్నారు. వీటితో పాటు రాష్ట్రంలో ఆనేక స్థానాల్లో ఇలాంటి పరిస్థితే ఏర్పడింది.ఇక కాంగ్రెస్ విషయానికి వస్తే...గ్రేటర్ హైదరాబాద్ లో ఏ మాత్రం పట్టులేని కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ఫలితాల తరువాత గ్రేటర్ పాలిటిక్స్ పైనే పూర్తిగా ఫోకస్ పెట్టింది. అందులో భాగంగానే ఆపరేషన్ ఆకర్ష్ కు శ్రీకారం చుట్టింది. ఇప్పటికే మేయర్,మాజీ మేయర్,మాజీ మేయర్, మాజీ డిప్యూటీ మేయర్,సిట్టింగ్ ఎంపీ,సిట్టింగ్ ఎమ్మెల్యే సహా పలువురు కీలక నేతలను కాంగ్రెస్ లో చేర్చుకున్నారు.గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న నాలుగు స్థానాల్లో కనీసం మూడు స్థానాల్లో గెలుపే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాలు రచిస్తున్నారు. ఏమాత్రం పట్టు లేని హైదరాబాద్ పై కూడా రేవంత్ రెడ్డి ఫోకస్ పెట్టారు. ఇక రేవంత్ రెడ్డి గత ఎన్నికల్లో ప్రాతినిధ్యం వహించినా మల్కాజిగిరి స్థానాన్ని మరోసారి భారీ మెజారిటీతో కైవసం చేసుకోవాలని భావుస్తున్నరు.ఇక సికింద్రబాద్ నుంచి ఖైరతాబాద్ శాసన సభ్యుడు దానం నాగేందర్ టికెట్ దక్కించుకున్నారు. ఏది ఏమైనప్పటికీ గ్రేటర్ హైదరాబాద్ లో లోక్ సభ ఎన్నికల సమరం రసవత్తరంగా మారింది.

## జల్లెడ పడుతున్న బలగాలు

ఎండాకాలం అనువైనది భావిస్తున్న కేంద్ర, రాష్ట్ర బలగాలు మహారాష్ట్ర, ఛత్తీస్గఢ్, తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లో జల్లెడతున్నారు. కూంబింగ్తో పాటు శాటిలైట్, మూడు రాష్ట్రాల్లోని గోదావరి వెంట గూగుల్ మ్యాప్లతో మావోయిస్టుల ఏరివేత జరుగుతుంది. అన్నీ కలిసి వచ్చి పైచేయి సాధిస్తున్నాయి పోలీస్ బలగాలు. అందుకు నెల రోజుల్లో జరిగిన ఎన్కౌంటర్లే నిదర్శనంగా చెప్పవచ్చు. మార్చి 19న మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో జరిగిన ఎన్కౌంటర్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. తెలంగాణ నుంచి మహారాష్ట్ర బీజాపూర్లోనీ ప్రాణహిత నది దాటి సమయంలో పోలీస్లకు మావోలకు ఎదురుకాల్పులు జరిగాయని పోలీస్లు తెలిపారు.మార్చి 27న ఛత్తీస్గఢ్లో భారీ ఎన్ కౌంటర్ జరిగి ఆరుగురు మావోయిస్టులు మృతి చెందారు. బాసగూడ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీజాపూర్ సుక్మా సరిహద్దు ప్రాంతంలోని చీపుర్భట్టి ప్రాంతంలో ఎదురు కాల్పులు జరిగి ఒక డిప్యూటీ కమాండర్ సహా ఆరుగురు మావోలు మృతి చెందారు.ఏప్రిల్ 2న ఛత్తీస్గఢ్ బీజాపూర్ జిల్లా కోర్చోలి అడవుల్లో తెల్లవారు జామున జరిగిన ఎదురు కాల్పుల్లో 13 మంది మావోయిస్టులు మృతి చెందారు. మావోయిస్టుల ఏరివేతలో భాగంగా కూంబింగ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న క్రమంలో కాల్పులు జరిగాయి. ఈ ఘటనలో పోలీస్లు ఆధునిక ఆయుధాలు స్వాధీనం చేసుకున్నారు. గత వారం కూడా అడవుల్లో తుపాకీ మోతలు మోగాయి. తెలంగాణఛత్తీస్గఢ్ సరిహద్దుల్లో ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఎన్కౌంటర్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ములుగు జిల్లా కర్రిగుట్టలు, ఛత్తీస్గఢ్లోని కాంకేర్ పరిధిలో ఉన్న అటవీ ప్రాంతంలో పోలీసులు కూంబింగ్ చేస్తున్న క్రమంలో భద్రతా బలగాలకు మావోయిస్టులకు కాల్పులు జరిగాయి. ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. ఘటనా స్థలంలో ఏకే47తోపాటు మూడు తుపాకులు, పేలుడు పదార్థాలు స్వాధీనం చేసుకున్నట్లు పోలీస్ వెల్లడించారు. నెలరోజుల వ్యవధిలోపే జరిగిన 4 ఎన్ కౌంటర్లలో 26మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎన్కౌంటర్లు నీటి పరివాహక ప్రాంతాలతోపాటు ఉదయం సమయాల్లో జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఎన్ కౌంటర్లలో చనిపోయిన వారిలో యువతే ఎక్కువగా ఉన్నారు. ఎండాకాలం మావోయిస్టులను కోలుకోలేని దెబ్బతీస్తుందని చెప్పవచ్చు.

# పాఠశాలలో 'చదవడం (రీడింగ్)' తప్పనిసరి సబ్జెక్టా ఉండాలి


- ప్రీ-ప్రైమరీ & ప్రైమరీ* విద్యార్థులలో పుస్తక పఠన సంస్కృతిని పెంపొందించడానికి సిటీ స్కూల్ "DEAR" అనే ఒక కొత్త చొరవను ప్రారంభించింది
- సెయింట్ పీటర్స్ హైస్కూల్ బహుశా భారతదేశంలో 'చదవడాన్ని' ఒక సబ్జెక్టా లేదా "పఠనం'ని దాని పాఠ్యాంశాల్లో ఒక పీరియడ్గా పరిచయం చేసిన ఏకైక పాఠశాల.
- మొబైల్, టీవీలు, టాబ్లెట్, PC, ల్యాప్టాప్, నోట్బుక్, OTT, మూవీ స్క్రీన్, ఇతర అనేక ఎలక్ట్రానిక్ పరికరాలతో, "టీనేజర్స్" "స్క్రీనేజర్స్" అయ్యారు.





**జయభేరి, హైదరాబాద్, ఏప్రిల్ 11 :**

డియర్డ్రాప్ ఎవ్రీథింగ్ అండ్ రీడ్, ముఖ్యంగా ప్రీప్రైమరీ & ప్రైమరీ పిల్లలలో చదివే అలవాటును పెంపొందించడానికి ఒక ప్రత్యేకమైన కార్యక్రమం, సెయింట్ పీటర్స్ ఉన్నత పాఠశాల అనే సిటీ స్కూల్ ప్రకటించింది. హైదరాబాద్లో గురువారం విడుదల చేసిన ప్రెస్ నోట్లో, బోవెన్పల్లి ఆధారిత పాఠశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సువర్ణ మాట్లాడుతూ, ఏప్రిల్ 13వ తేదీ శనివారం ఉదయం 8.30 గంటలకు సుమారు గంటసేపు ఈ కార్యక్రమాన్ని ప్లాన్ చేసినట్లు తెలిపారు. ఇది నర్సరీ పిల్లలకు మొదలుకొని 5వ తరగతి వరకు పిల్లలకు నిర్వహించబడుతుంది.
మేము తరగతి నర్సరీ 5వ తరగతిక వరకు అందరు విద్యార్థులను ఆహ్వానించాము, అంటే దాదాపు 800+ మంది ని ఆహ్వానించాము. అందులో నుండి కనీసం 200+ మంది పిల్లలు, తల్లిదండ్రులు ఈ ప్రత్యేక చొరవ కోసం హాజరవుతారని మేము ఆశిస్తున్నాము, డాక్టర్ సువర్ణ జోడించారు. పిల్లలను వారి తల్లిదండ్రులతో పాటు పుస్తకాలు చదివేలా చేయడం కోసం ఇది ఒక చొరవ. ఇందుకోసం పాఠశాల ఆవరణ మొత్తాన్ని రీడింగ్ జోన్గా మార్చనున్నారు. థీమ్ ఆధారిత రీడింగ్ కార్నర్లు ఏర్పాటు చేయబడుతున్నాయి, ఇక్కడ పిల్లలు తమ తల్లిదండ్రులతో కలిసి పుస్తకాలు చదువుతారని పాఠశాల కరస్పాండెంట్ టి. ఆల్ఫోన్స్ రెడ్డి తెలిపారు. పాఠశాలకు 'చదవడాన్ని' ఒక సబ్జెక్టా దాని విద్యా పాఠ్యాంశాల్లో కలిగి ఉన్న మరొక ప్రత్యేకత కూడా ఉంది. నర్సరీ నుండి క్లాస్ III వరకు వారి పుస్తకం లేదా సాహిత్యం యొక్క ఎంపికను గంట సమయంలో చదవడానికి ప్రత్యేక వ్యవధిని ఉంచారు. చదవడం ముఖ్యం ఎందుకంటే ఇది మనస్సును అభివృద్ధి చేస్తుంది. జ్ఞానం, జీవిత పాఠాలను ఇస్తుంది. కానీ, చదివే అలవాటు మెల్లగా క్రమంగా తగ్గుతోంది. సాంకేతికత మనం చదవడం, వ్రాయడంపై ప్రభావం చూపుతోంది. స్మార్ట్ఫోన్లు, టాబ్లెట్లు, ఇరీడర్లతో, పిల్లలు 'స్క్రీనేజర్లుగా' మారారు (మొబైల్, టాబ్లెట్, PC, ల్యాప్టాప్, OTT, TV, సినిమా, అనేక ఇతర స్క్రీన్లను ఉపయోగించడం). ఈ రోజుల్లో పిల్లలు డిజిటల్గా చదవడం పెద్ద ఆశ్చర్యం కాదు. పఠన అలవాట్లలో ఈ మార్పు పుస్తక పఠనం యొక్క భవిష్యత్తు గురించి చాలా చర్చకు దారితీసింది. ఈ నేపథ్యంలో, గతంలో ఇలాంటి వినూత్న కార్యక్రమాలకు పేరుగాంచిన పాఠశాల డియర్డ్రాప్ ఎవ్రీథింగ్ అండ్ రీడ్ ఇనిషియేటివ్తో ముందుకు వచ్చింది. ఇది బహుశా దేశంలోనే మొదటిసారిగా ప్రారంభించబడిన వినూత్న చొరవ. సెయింట్ పీటర్స్ హైస్కూల్, బోవనల్లీ, హైదరాబాద్ బహుశా భారతదేశంలోనే ఇటువంటి సాహసోపేతమైన చొరవతో ముందుకు వచ్చి "పఠనం"ను ఒక సబ్జెక్టా పరిచయం చేసిన మొదటి పాఠశాల అని కరస్పాండెంట్ T. అల్ఫోన్స్ రెడ్డి అన్నారు. ఇది బహుళ లక్ష్యాలతో కూడిన చొరవ. ఈ చొరవ వెనుక ఉన్న ఆలోచన ఏమిటంటే, పిల్లలను విస్తృతంగా ఎలక్ట్రికల్ పరికరాలను ఉపయోగించడం నుండి దూరం చేయడం, కుటుంబ బంధాన్ని పెంచడం, తల్లిదండ్రులు తమ పిల్లలు/పిల్లలతో కలిసి చదివేందుకు రోజుకు కనీసం 15 నిమిషాలు గడపాలని ప్రోత్సహించడం. పాఠశాలలో "చదవడం" తప్పనిసరి సబ్జెక్టుగా మార్చాలని డాక్టర్ సువర్ణ అన్నారు. చదవడం వల్ల గ్రేడ్లు, అకడమిక్ పనితీరు మెరుగుపడటమే కాకుండా పిల్లలు మంచి పౌరులుగా తయారవుతారని డాక్టర్ సువర్ణ తెలియజేసారు. ఒక సబ్జెక్టా చదవడం ఎలా పని చేస్తుంది? పిల్లలు స్వతంత్రంగా, ఆనందంగా చదవడానికి సహాయం అవసరమని పరిశోధనలో తేలిందని, ఇది ప్రాథమిక బోధనా సెటప్లో ఉపాధ్యాయుల పాత్రను తగ్గిస్తుందని డాక్టర్ సువర్ణ చెప్పారు.




## ఎలాంటి సమస్యలు ఉన్నా పరిష్కరించేలా చూస్తా..

**జయభేరి, మేడిపల్లి :**

శాంతి వనం పార్కు మార్నింగ్ వాక్ లో పాల్గొన్న ఎంపీ అభ్యర్థి పట్నం సునీత మహేందర్ రెడ్డి, టీపిసిసి ఉపాధ్యక్షులు, మేడ్చల్ నియోజకవర్గ ఇంచార్జ్ వజ్రెష్ యాదవ్, పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తుంగతుర్తి రవి. అనంతరం రవి మాట్లాడుతూ.. మార్నింగ్ వాక్ చేయటం వలన ఎన్నో ఆరోగ్య సమస్యలు దరిచేరవని అన్నారు, మానసికంగా, శారీరకంగా ఆరోగ్యవంతమైన జీవితం సాగించవచ్చని అన్నారు. కార్పొరేషన్ లో ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకువస్తే వాటిని పరిష్కరించేందుకు వజ్రెష్ యాదవ్, సునీత మహేందర్ రెడ్డి సహకారంతో సమస్యలను పరిష్కరించేలా చూస్తానని అన్నారు. ఈ కార్యక్రమం లో పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, బోడుప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## మనిషిని మహోన్నతుడిగా తీర్చిది విద్య ఒక్కటే

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి.



**జయభేరి, కాప్రా :**

మనిషిని మహోన్నతుడిగా తీర్చిదిద్దేది విద్య ఒకటే అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. అందరికీ విద్యను అందించేలా కృషిచేసిన మహనీయుడు, తత్వవేత్త, సంఘ సంస్కర్త మహాత్మ జ్యోతిబాపూలే జయంతి సందర్భంగా సైనిక్ పూరి మరియు మల్లాపూర్ ఎలిఫెంట్ సర్కిల్ వద్ద జరిగిన మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజంలో అణగారిన వర్గాల అభ్యున్నతి, వారి విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన గొప్ప సంఘ సంస్కర్త, మానవతావాది పూలే. సామాజిక ఉద్యమాల మార్గదర్శి మహాత్మా జ్యోతిరావు పూలే చదువు లేనిదే జ్ఞానం లేదు, జ్ఞానం లేనిదే పురోగతి లేదు అనే సత్యాన్ని గ్రహించి 19వ శతాబ్దపు తొలినాళ్లలో నిమ్న జాతుల కోసం, మహిళల కోసం దేశంలో మొదటిసారిగా పాఠశాలలను ఏర్పరిచిన మహనీయుడు జ్యోతి రావు పూలే. విద్యావ్యాప్తి ద్వారా కుల వివక్షతను, సాంఘిక దురాచారాలను, మూఢ నమ్మకాలను నిర్మూలించేందుకు కృషి చేశారు. కులం పేరుతో తరతరాలుగా అన్ని రకాలుగా అణచివేతలకు వివక్షతలకు గురయిన బడుగు, బలహీన వర్గాలలో ఆత్మస్థైర్యం కల్పించి, వారి హక్కుల కోసం పోరాడి, సాధికారత కోసం కృషి చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్లాపూర్ డివిజన్ కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, AS Rao Nagar డివిజన్ అధ్యక్షులు కాసం మహిపాల్ రెడ్డి, వంశీ రాజు మల్లేష్, చర్లపల్లి డివిజన్ అధ్యక్షుడు గిరి బాబు, నవీన్ గౌడ్, మహేష్ గౌడ్ కుమార స్వామి తదితరులు పాల్గొన్నారు.



## సామాజిక దార్శనికుడు మహాత్మా జ్యోతిరావు పూలే

- అమరం మోహన్ రెడ్డి

**జయభేరి, మేడ్చల్ :**

బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేసిన సామాజిక దార్శనికుడుబీ మహాత్మా జ్యోతిరావు పూలే అని మేడ్చల్ బిజెపి అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మహాత్మా జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో విగ్రహదాత కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమరం మోహన్ రెడ్డి మాట్లాడుతూ సమాజంలో కుల, లింగ వివక్షతకు తావు లేకుండా అన్ని వర్గాలకు విద్య అందాలని, విద్య ద్వారానే బలహీన వర్గాలు సామాజికంగా ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని పూలే భావించారన్నారు. ఈ కార్యక్రమంలో విగ్రహదాత కౌన్సిలర్ దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, కౌన్సిలర్లు అమరం సరస్వతి, సాయిపేట శ్రీనివాస్, బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు ఉషిగారి శ్రీనివాస్, బిఆర్ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవ్ గౌడ్, నాయకులు రవీందర్ గౌడ్, కిషన్, శ్రీనివాస్ రెడ్డి, జగన్, కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహాత్మ జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు



**జయభేరి, దేవరకొండ :**


దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు NVT, మహాత్మ జ్యోతి రావు పూలే 197 వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు, అనంతరం వారు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి, కుల వ్యతిరేక సంఘసంస్కర్త రచయితని, సామాజిక కార్యకర్త అంటరానితనం మరియు కుల వ్యవస్థ నిర్మూలన మరియు మహిళలు మరియు అన్నగారిన కులాల ప్రజలకు విద్యను అందించడంలో ఆయన చేసిన కృషితో సహా అనేక రంగాలకు విస్తరించిందని, అలాంటి మహనీయులను ఎప్పుడు మరువరాదని, ఆయన ఆశయ సాధనకై యువత ఎప్పుడు ముందుండాలని ఈ సందర్భంగా వారు అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, ఫోటోగ్రాఫర్ కర్నాటి నరేష్, చండిశ్వర్, మధు, రాజు, సురేష్ యాదవ్, యాదయ్య, రాము, మహేష్, శేఖర్ , ఫణి, తదితరులు పాల్గొన్నారు.

# రంజాన్ పర్వదినం ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు

**జయభేరి, మేడిపల్లి :**



బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రంజాన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. నగర పరిధిలోని మస్జీద్ఏకతుబ్షాహీ (ఆలంగీర్) నందు పెద్దసంఖ్యలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో ప్రార్థనలు నిర్వహించారు. మత గురువు మహమ్మద్ షఫీ ఆలం రంజాన్ సందేశాన్ని ఇచ్చారు. చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని పండగ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మస్జీద్ కమిటీ అధ్యక్షులు మొహమ్మద్ తాజుద్దీన్ మాట్లాడుతూ.... పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు. తెలంగాణ సమాజం "గంగా, జామునా తెహజీబ్" మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో రంజాన్ పండుగ జరుపుకోవడానికి సహకరించిన మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి, పోలీస్ అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మన సమాజంలో సామరస్యం, కరుణ, స్ఫూర్తిని పెంపొందించాలన్నారు. ప్రతి ఒక్కరికి మంచి ఆరోగ్యం, శ్రేయస్సు కోసం ప్రార్థిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మస్జీద్ కమిటీ సభ్యులు మహబూబ్ అలీ, మొహమ్మద్ ఖాన్, అలీం, ఖాదర్, మీరావలి, అబ్దుల్ హమీద్, అహ్మద్, అక్బర్, షఫీ, అబ్బాస్, మిస్కిన్ వలి, ఇస్మాయిల్, మోయిన్, తదితరులు పాల్గొన్నారు.



# పవిత్ర రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు



- ఎమ్మెల్యే బాలు నాయక్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనల అనంతరం ముస్లీం సోదరులు మరియు పార్టీ నాయకులకు ఆత్మీయ పలకరింపు, అలింగనం చేసుకోని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసిన దేవరకొండ శాసన సభ్యులు బాలు నాయక్ అనంతరం ఈద్ఉల్ఫితర్ వేడుకలను ఆనందంగా జరుపుకొని అల్లా దీవెనలు అందుకోవాలని ఆకాంక్షించారు. అన్ని సేవలకు మించి మానవ సేవ అత్యున్నతమైనదని చాటి చెప్పే రంజాన్.... లౌకికవాదానికి, మత సామరస్యానికి, ప్రతీక అన్నారు. పవిత్ర గ్రంథం ఖురాన్ ఉద్భవించిన మాసంలో ముస్లింలు అనుసరించే కఠోర ఉపవాస దీక్షలు క్రమశిక్షణతో నిర్వహించే ప్రార్థనలు, పేదలకు చేసే దానధర్మాలు మానవాళికి ఆదర్శంగా నిలుస్తాయి అన్నారు. ఈ సందర్భంగా గంగా జమున తెహజిబ్ కు తెలంగాణ ప్రతీక అని ముస్లిం మైనార్టీల అభ్యున్నతికి తమ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని రాష్ట్ర ప్రజలంతా కలిసి మెలిసి సుఖ సంతోషాలతో జీవించేలా అల్లా ఆశీర్వాదాలు ఉండాలని ఎమ్మెల్యే బాలు నాయక్ ప్రార్థించారు ఈ కార్యక్రమంలో ముస్లిం మత పెద్దలు ముస్లిం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులందరికీ రంజాన్ శుభాకాంక్షలు

- ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి




**జయభేరి, కాప్రా :**

కాప్రా, ఈద్గా దర్గా, మల్లాపూర్ దర్గాలో కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి తో కలిసి ఉప్పల్ నియోజకవర్గ మైనార్టీ అధ్యక్షులు బద్రుద్దీన్ అధ్వర్యం లో ఈద్గా దర్గాకు ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి పాల్గోని రంజాన్ నెల ముస్లిం సోదరులకు ఎంతో పవిత్రమైంది. వారు నెల రోజులపాటు కఠిన తర ఉపవాసాలు దీక్షలు చేస్తూ అల్లాహ్ కి ప్రార్థనలు చేశారు. ఇలాంటి ఎంతో ప్రాముఖ్యత కలిగిన నెల చివరి రోజున రంజాన్ పండగను జరుపుకుంటున్న ముస్లిం సోదరులందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో BRS పార్టీ నాయకులు బైరీ నవీన్ గౌడ్, రహీమ్, శివ, కిట్టు తదితరులు పాల్గొన్నారు.


## రంజాన్ పర్వదినం ముస్లింలకు హృదయపూర్వక శుభాకాంక్షలు

- మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**జయభేరి, మేడిపల్లి :**

రంజాన్ పర్వదినం (ఈద్ ఉల్ ఫితర్) సందర్భంగా పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఈద్గాలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో అయన పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... పవిత్ర రంజాన్ ఉపవాస దీక్షల మాసం క్రమశిక్షణ, ఆధ్యాత్మిక చింతన, దాతృత్వం, ప్రేమ, క్షమ, దయ, ఉపకారం, సోదర భావం, ఐక్యతను పెంపొందిస్తుందని పేర్కొన్నారు. పవిత్ర ఖురాన్ అవతరించిన మాసంలో ముస్లింలు ఉపవాసాలు ఉంటూ ఆధ్యాత్మిక చింతనతో ప్రత్యేక ప్రార్థనలు, దానధర్మాలు చేస్తుంటారన్నారు. తెలంగాణ సమాజం "గంగా, జామునా తహజీబ్" మత సామరస్యానికి ప్రతీక అన్నారు. ముస్లింలు తమ ఉపవాస దీక్షలు విరమించి భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి రంజాన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



# కాటుకతో సమస్యలు

- రోజంతా కళ్ళకు కాటుక ఉంచడం వల్ల వచ్చే సమస్యలు ఎన్నో
- మేకప్‌లాగే కాటుకను తొలగించాల్సిందే

జయభేరి, హైదరాబాద్ :

కళ్లకు కాటుక పెడితేనే అందం. కొంతమంది దీన్ని కాజల్ అని, మరికొందరు కోల్ అని పిలుస్తారు. మేకప్ రిమూవ్ చేసేటప్పుడు కాటుకను కూడా కచ్చితంగా తొలగించుకోవాల్సిందే. చెంపకు చేరడేసి కళ్ళు.. ఆ కళ్ళకు కాటుక పెడితే ఆ అందమే వేరు. అమ్మాయిల అందాన్ని పెంచేది కళ్ళే. ఆ కళ్ళకు కాటుక, ఐలైనర్ వంటి కాస్మోటిక్స్‌ను వాడేవారు ఎంతోమంది. అయితే రోజంతా కాటుకతోనే కళ్ళను ఉంచడం మంచిది కాదు. దీర్ఘకాలంలో కొన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. బయట నుంచి ఇంటికి వచ్చాక కాటుకను తొలగించుకోవడం చాలా ముఖ్యం. ఎంతోమంది మేకప్ రిమూవ్ చేసేటప్పుడు కేవలం చెంపలకు, నుదుటి దగ్గర ఉన్న మేకప్ ను మాత్రమే తొలగించుకుంటారు. కాటుక జోలికి పోరు. కాటుకను రోజంతా ఉంచుకోవడం వల్ల దీర్ఘకాలంలో వచ్చే కొన్ని సమస్యలు ఉన్నాయి. అవేంటో తెలుసుకోండి.

కాటుకను ఎక్కువ సేపు ధరించడం వల్ల కళ్ళు చికాకుగా అవుతాయి. కొన్నిసార్లు ఎరుపెక్కుతాయి. అసౌకర్యంగా అనిపిస్తాయి. కాటుకలో వాడిన కొన్ని రకాల పదార్థాల వల్ల ఇలా జరుగుతుంది. ఆ పదార్థాలు కళ్ళలోకి ప్రవేశించడం వల్ల కళ్ళు ఎరుపెక్కడం, అసౌకర్యంగా ఉండడం, మంట పెట్టడం వంటివి జరుగుతాయి. కొంతమందికి కాటుకలో వాడే పదార్థాలు సరిపడవు. ఇవి అలెర్జీకి కారణం అవుతాయి. ఇలాంటి వారికి వెంటనే అలెర్జీ కనిపించదు. దీర్ఘకాలంలో దురద పెట్టడం, కళ్ళ చుట్టూ వాపు రావడం, దద్దుర్లు రావడం వంటివి జరుగుతాయి. అలాంటి వారికి కాటుక పడడం లేదని అర్థం చేసుకోవాలి. కాటుకను రోజంతా ఉంచడం వల్ల కొన్నిసార్లు కళ్ళు పొడిబారుతాయి. కాటుకలో వాడిన కొన్ని పదార్థాలే దీనికి కారణం. కనురెప్పలపై లేదా కంటి కింద ప్యాచెస్ లా కూడా ఏర్పడతాయి. కాబట్టి రోజులో కాసేపు మాత్రమే కాటుకను కంటికి ఉంచుకోండి. కాటుక పెన్సిల్ లేదా ఐలైనర్ పెట్టే బ్రెష్ వంటివి శుభ్రంగా ఉంచుకోవాలి. వాటి మీద దుమ్మూ ధూళీ పడితే కలుషితం అవుతాయి. దీనివల్ల బ్యాక్టీరియా, ఫంగల్ ఇన్ఫెక్షన్లు కంటిలో చేరే ప్రమాదం ఉంది. దీనివల్ల కండ్ల కలక వంటివి రావచ్చు. కనుక ఎప్పటికప్పుడు వాటిని శానిటైజ్ చేసుకోవడం చాలా ముఖ్యం. కాటుకను రోజంతా ఉంచుకోవడం వల్ల అది కంటి కింద చర్మం వరకు పాకుతుంది. దీన్నే స్మడ్జింగ్ అని అంటారు. వేడి వాతావరణం లేదా తేమ కూడిన వాతావరణంలో ఇలా ఎక్కువగా కాటుక కరిగి కంటి కింద ఉన్న చర్మానికి కూడా పాకుతుంది. ఇది అందాన్ని పెంచడం కాదు, తగ్గిస్తుంది. కాబట్టి వీలైనంత సమయం మాత్రమే కాటుకను ఉంచుకుని తర్వాత తొలగించుకోవడమే మంచిది కొన్ని సందర్భాల్లో కాటుకలోని రసాయనాలు కళ్ళల్లో చేరి... కంటిచూపును కూడా ప్రభావితం చేస్తాయి. కళ్ళు మసకబారడం, దృష్టి తాత్కాలికంగా తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే కాటుక వాడడం మానేయాలి. వైద్యుల వద్దకు వెళ్లాలి. కాటుకను ఇప్పుడు ఎక్కువమంది పెన్సిల్‌తో పెట్టుకుంటున్నారు. ఒక్కొక్కసారి పెన్సిల్ సరిగా పట్టుకోకపోతే కంటి లోపల కార్నియా పై గీతలు పడే అవకాశం ఉంటుంది. అలాగే కొందరు చూపుడు వేలుతో కాటుకను పెట్టుకుంటారు. ఆ వేలికి గోర్లు లేకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. కార్నియా చాలా సున్నితమైనది. ఏమాత్రం దెబ్బతిన్నా కంటిచూపు తగ్గుతుంది. రోజంతా కాటుకను ఉంచుకోవడం వల్ల దీర్ఘకాలంలో కొంతమంది వ్యక్తుల్లో కన్నీటి ఉత్పత్తి పెరుగుతుంది. కళ్ళల్లోంచి నీరు కారడం వంటివి జరుగుతాయి. ఈ పరిస్థితి చాలా ఇబ్బందికరంగా ఉంటుంది. కాబట్టి కాటుకను రోజులో కొంతసేపు మాత్రమే ఉంచి మిగతా సమయంలో తొలగించడమే మంచిది.





**120 బంతుల్లో 197. టీ20లలో ఇదేం కాపాడుకోలేనంత తక్కువ లక్ష్యమేమి కాదు. కానీ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) బౌలర్ల పుణ్యమా అని ఈ భారీ ఛేదనను ముంబై ఇండియన్స్ 93 బంతుల్లోనే ఊదేసింది. క్రీజులోకి వచ్చిన బ్యాటర్ కొడితే సిక్స్ లేకుంటే ఫోర్ అన్న రేంజ్‌లో విధ్వంసరచన చేస్తూ అరేబియా సముద్రపు తీరాన పరుగుల వరద పారించారు. బెంగళూరు బౌలింగ్ యూనిట్‌ను నెట్ బౌలర్లుగా మారుస్తూ ఇషాన్, సూర్య కొట్టిన కొట్టుడుకు అంత భారీ లక్ష్యం ఏమాత్రమూ సరిపోలేదు. బుమ్రా ఐదు వికెట్లతో చెలరేగగా డుప్లెసిస్, పాటిదార్, కార్తీక్ మెరుపులతో ఆర్సీబీ భారీ స్కోరు చేసినా ఆ జట్టు మరోమారు ఓటమి వైపే నిలిచింది. ఈ సీజన్‌లో ముంబైకి ఇది రెండో గెలుపు కాగా ఆర్సీబీకి ఐదో ఓటమి.**

# వాంఖడేలో ముంబై గర్జన..

- 197 పరుగుల లక్ష్యాన్ని 99 బాల్స్‌లోనే ఊదేశారు
- 93 బంతుల్లో 199... ఇషాన్, సూర్య సుడిగాలి ఇన్నింగ్స్
- బెంగళూరుకు ఐదో పరాభవం.. ఐదు వికెట్లతో బుమ్రా

ఐపీఎల్ 17లో హ్యాట్రిక్ ఓటముల తర్వాత ఢిల్లీ మ్యాచ్‌తో విజయాల బాట పట్టిన ముంబై ఇండియన్స్ సొంత ఇలాఖా వాంఖడేలో మరోసారి విజయ గర్జన చేసింది. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు నిర్దేశించిన 197 పరుగుల లక్ష్యాన్ని మరో 27 బంతులు మిగిలుండగానే 'ఉఫ్'మని ఊదేసింది. బౌలింగ్‌లో స్పీడ్‌గుర్రం జస్‌ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల (5/21)తో చెలరేగితే బ్యాటింగ్‌లో ఇషాన్ కిషన్ (34 బంతుల్లో 69, 7 ఫోర్లు, 5 సిక్సర్లు), సూర్యకుమార్ యాదవ్ (19 బంతుల్లో 52, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), రోహిత్ శర్మ (24 బంతుల్లో 38, 3 ఫోర్లు, 3 సిక్సర్లు) చితక్కొట్టడంతో ముంబై 15.3 ఓవర్లలోనే 7 వికెట్ల తేడాతో గెలిచింది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆర్సీబీ.. కెప్టెన్ డుప్లెసిస్ (40 బంతుల్లో 61, 4 ఫోర్లు, 3 సిక్సర్లు), దినేశ్ కార్తీక్ (23 బంతుల్లో 53 నాటౌట్, 5 ఫోర్లు, 4 సిక్సర్లు), రజత్ పాటిదార్ (26 బంతుల్లో 50, 3 ఫోర్లు, 4 సిక్సర్లు) రాణించడంతో నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. బుమ్రాకు ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.


ఆర్సీబీ ఇన్నింగ్స్ ఒడిదొడుకులతోనే మొదలైంది. ఈ సీజన్‌లో సూపర్ ఫామ్‌లో ఉన్న కోహ్లీ (3)ని బుమ్రా మూడో ఓవర్లోనే ఔట్ చేయడంతో బెంగళూరు తొలి వికెట్ కోల్పోయింది. తొలి మ్యాచ్ ఆడుతున్న విల్ జాక్స్ (8) రెండు ఫోర్లు కొట్టినా ఆకాశ్ మధ్వాల్ 4వ ఓవర్లో టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చాడు. 23 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఆర్సీబీని డుప్లెసిస్, పాటిదార్ నిలబెట్టారు. ఈ ఇద్దరూ వికెట్ కాపాడుకుంటూనే వీలుచిక్కినప్పుడల్లా బంతిని బౌండరీ లైన్ దాటించారు. గెరాల్డ్ కొయెట్జ్ వేసిన 12వ ఓవర్లో వరుసగా రెండు సిక్సర్లు కొట్టిన పాటిదార్.. 25 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తిచేశాడు. కోహ్లీ కాకుండా ఈ సీజన్‌లో ఆర్సీబీ తరఫున తొలి ఫిఫ్టీ చేసిన బ్యాటర్ అతడే. కానీ ఆ ఓవర్లో మరుసటి బంతికే పాటిదార్.. ఇషాన్‌కు క్యాచ్ ఇవ్వడంతో 82 పరుగుల మూడో వికెట్ భాగస్వామ్యానికి తెరపడింది. రజత్ స్థానంలో వచ్చిన మ్యాక్స్‌వెల్ మరోసారి సున్నా చుట్టాడు. ఆఖర్లో కార్తీక్ దుమ్మురేపాడు. ముంబై బౌలర్లను ఉతికి ఆరేస్తూ కార్తీక్ 22 బంతుల్లోనే 50 పూర్తి చేయడంతో ఆర్సీబీకి భారీ స్కోరు దక్కింది.

భారీ లక్ష్య ఛేదనలో ముంబై ఆదినుంచే విరుచుకుపడింది. అంతంతమాత్రంగానే ఉన్న ఆర్సీబీ బౌలర్లపై ఇషాన్, రోహిత్ తుఫానులా ముంచెత్తారు. ముఖ్యంగా ఇషాన్ అయితే కొడితే సిక్స్ లేదంటే ఫోర్ అన్న రేంజ్‌లో చెలరేగాడు. 9 ఓవర్లలోనే 100 పరుగులు పూర్తిచేసిన ఈ జోడీని ఎట్టకేలకు ఆకాశ్ దీప్ విడదీశారు. ఇషాన్ నిష్క్రమించినా వన్‌డౌన్‌లో వచ్చిన సూర్యకుమార్ యాదవ్.. బ్యాట్‌లో స్ప్రింగులు పెట్టుకుని వచ్చాడా అన్న అనుమానం కలిగేలా బాదేశాడు. 15 పరుగుల వద్ద అతడిచ్చిన క్యాచ్‌ను డీప్‌లో మ్యాక్స్‌వెల్ జారవిడవడంతో సూర్య ఆ అవకాశాన్ని రెండుచేతులా అందుకున్నాడు. రోహిత్ ఔట్ అయినా హార్దిక్ పాండ్యా (6 బంతుల్లో 21 నాటౌట్, 3 సిక్సర్లు) అండతో దుమ్మురేపాడు. 17 బంతుల్లోనే అతడి అర్ధ శతకం పూర్తైంది. ఐపీఎల్‌లో సూర్యకు ఇది వేగవంతమైన అర్ధసెంచరీ కావడం విశేషం. బౌలర్ ఎవరన్నది లెక్కచేయని నైజంతో సూర్య సృష్టించిన విధ్వంసానికి స్టేడియం హోరెత్తిపోయింది. మిస్టర్ '360' అన్న ట్యాగ్‌లైన్‌కు తగ్గట్లు సూర్య కొట్టిన షాట్లకు ఫ్యాన్స్ ఫిదా అయ్యారు. 13వ ఓవర్లో సూర్య పెవిలియన్ చేరినా తిలక్ వర్మ (10 బంతుల్లో 16 నాటౌట్, 3 ఫోర్లు) తో కలిసి పాండ్యా విజయ లాంఛనాన్ని పూర్తిచేశాడు.

16 ఓవర్లకు 1494తో పటిష్ఠంగా కనిపించిన బెంగళూరుకు బుమ్రా వరుస ఓవర్లలో షాకులిచ్చాడు. 17వ ఓవర్లో డుప్లెసిస్‌తో పాటు మహిపాల్ లోమ్రర్(0)ను ఔట్ చేసిన అతడు.. 19వ ఓవర్లో సౌరవ్ చౌహాన్ (9), విజయ్‌కుమార్ (0)ను పెవిలియన్ చేర్చాడు.

**సంక్షిప్త స్కోర్లు :** బెంగళూరు: 20 ఓవర్లలో 196/8 (డుప్లెసిస్ 61, కార్తీక్ 53 నాటౌట్, బుమ్రా 5/21, గోపాల్ 1/32). ముంబై : 15.3 ఓవర్లలో 199/3 (ఇషాన్ 69, సూర్య 52, జాక్స్ 1/24, వైశాక్ 1/32)

# రాత్రి రాత్రే అద్భుతం జరుగుతుంది





- కొబ్బరి నూనెలో ఈ ఒక్కటి మిక్స్ చేసి రాస్తే చాలు..

ముఖ సౌందర్యాన్ని కాపాడుకోవడానికి మనం చాలా హోం రెమెడీస్ ఉపయోగిస్తుంటాం. వాటిలో ఒకటి కొబ్బరి నూనె. ఇది మీ చర్మాన్ని మృదువుగా చేయడమే కాకుండా మొటిమలను క్లియర్ చేస్తుంది. సాధారణంగా చాలా మంది తమ చర్మాన్ని అందంగా ఉంచుకోవడానికి రకరకాల ఖరీదైన ఉత్పత్తులను ఉపయోగిస్తుంటారు. మరికొందరు కొన్ని హోం రెమెడీస్‌ను ఉపయోగిస్తారు. కొబ్బరి నూనె మీ ముఖ సౌందర్యాన్ని పెంచుతుందని మీకు తెలుసా? కొబ్బరి నూనెతో ఆముదం మిక్స్ చేసి ముఖానికి అప్లై చేయాలి. ఈ ప్రయోజనాల గురించి తెలుసుకుందాం. మీ ముఖంపై ముడతలు లేదా సన్నని గీతలు వంటి వృద్ధాప్య సంకేతాలు ఉంటే, మీరు కొబ్బరి నూనె, ఆముదం ఉపయోగించవచ్చు. ఈ రెండింటిలో యాంటీ ఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి చర్మాన్ని రక్షించడమే కాకుండా ముఖంపై వృద్ధాప్య ప్రక్రియను నెమ్మదిస్తాయి. ఇది ముడతలు, ఫైన్ లైన్ల నుండి ఉపశమనాన్ని అందిస్తుంది. కొబ్బరి నూనె, ఆముదం నూనె ఈ రెండు నూనెల మిశ్రమాన్ని రాత్రి నిద్రించే ముందు మీ ముఖంపై రాయండి. మీ చర్మం నునుపుగా మారుతుంది. ఇవి చర్మాన్ని కాంతివంతంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. అలాగే పొడి చర్మం ఉన్నవారు దీన్ని రోజూ ముఖానికి రాసుకోవచ్చు. కొబ్బరినూనెను ఆముదంతో కలిపి రాత్రి పడుకునే ముందు ముఖానికి రాసుకుంటే మొటిమలు పోతాయి. ఎందుకంటే వాటిలో యాంటీ బ్యాక్టీరియల్ లక్షణాలు ఉంటాయి. ఇవి మొటిమలను క్లియర్ చేయడంలో సహాయపడతాయి. ఇది మొటిమలను నివారిస్తుంది.

వేసవి ఎండ నుండి ముఖం కాంతివంతంగా కనిపిస్తుంది. ముఖంపై సన్ టాన్ ఉంటే కొబ్బరినూనెలో ఆముదం కలిపి రాత్రిపూట ముఖానికి రాసుకుంటే టాన్ తగ్గుతుంది. ఇది చర్మాన్ని ఆరోగ్యంగా, తేమగా ఉంచుతుంది. రాత్రి పడుకునే ముందు కొబ్బరినూనెలో ఆముదం కలిపి ముఖానికి రాసుకుంటే చర్మం మంట తగ్గుతుంది. ఆముదం నూనెలో యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉన్నాయి. మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. కొబ్బరి నూనె కూడా మొటిమలను నివారిస్తుంది.

కొబ్బరినూనెతో ఆముదం కలిపి ముఖానికి రాసుకోవడం ఎలా?

ముందుగా మీరు 2 టీస్పూన్ల కొబ్బరి నూనె తీసుకోవాలి. దానికి కొన్ని చుక్కల ఆముదం కలపండి. మీరు ఓకే అయితే బదులుగా బాదం నూనెను కూడా కలుపుకోవచ్చు. దీన్ని మీ ముఖానికి అప్లై చేసి 2 నుంచి 3 నిమిషాల పాటు మసాజ్ చేసి రాత్రంతా అలాగే ఉంచాలి. తర్వాత ఉదయం మామూలుగానే ముఖం కడుక్కోవాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే మీ ముఖం మెరిసిపోతుంది. మొటిమలు తగ్గుతాయి. కొబ్బరి నూనెలో ఉండే కొవ్వు ఆమ్లాలు, లారిక్, క్యాప్రిక్ యాసిడ్ వాటి యాంటీమైక్రోబయల్ లక్షణాల వల్ల చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో అద్భుతంగా ఉన్నాయి. అంటే అవి మన చర్మంపై పెరిగే హానికరమైన సూక్ష్మజీవులను చంపుతాయి. మొటిమలు, ఫోలిక్యులిటిస్, సెల్యులైటిస్ వంటి సాధారణ చర్మ ఇన్ఫెక్షన్లు శిలీంధ్రాలు, బ్యాక్టీరియా వల్ల సంభవిస్తాయి. వీటిని కొబ్బరి నూనెలోని లారిక్, క్యాప్రిక్ యాసిడ్ చంపడానికి సహాయపడతాయి.

కొబ్బరి నూనె అధిక తేమను కలిగి ఉంటుంది. పొడి, పగిలిన చర్మానికి కొబ్బరి నూనె అత్యంత ప్రభావవంతమైన మాయిశ్చరైజర్‌గా పని చేస్తుంది. కొబ్బరి నూనె చర్మాన్ని హైడ్రేట్ చేయడానికి, తేమను బాగా నిలుపుకోవడానికి సహాయపడుతుంది. అంటే పొడి చర్మం కోసం కొబ్బరి నూనె అద్భుతమైనది. కొబ్బరి నూనె మన శరీరంలోని యాంటీ ఆక్సిడెంట్లు, కొల్లాజెన్ స్థాయిని పెంచే సామర్థ్యాన్ని కలిగి ఉందని అధ్యయనాలు నిరూపించాయి. ఇవి మన చర్మం యొక్క సహజ పునరుత్పత్తి, మరమ్మత్తు ప్రక్రియలో ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి.






# మహేశ్ నయా లుక్


టాలీవుడ్, పాన్ ఇండియాతోపాటు గ్లోబల్ మూవీ లవర్స్ ఎక్జయిటింగ్‌గా ఎదురుచూస్తున్న ప్రాజెక్ట్ ఎస్ఎస్ఎంబీ 29. గుంటూరు కారం తర్వాత సూపర్ స్టార్ మహేశ్‌బాబు హీరోగా గ్లోబల్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా వస్తున్న ఈ సినిమాకు స్టార్ డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ మూవీ ప్రీ ప్రొడక్షన్ పనులు కొనసాగుతున్నాయని.. త్వరలోనే గ్రాండ్‌గా లాంఛ్ ఉండబోతుందని ఇప్పటికే వార్తలు హల్ చల్ చేస్తూ మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచుతున్నాయి. ఈ మూవీ కోసం మహేశ్ లుక్ టెస్ట్ కూడా పూర్తయినట్టు గతంలో వార్తలు కూడా వచ్చాయి. తాజాగా మహేశ్ బాబు నయా లుక్‌లో కనిపించి ఔరా అనిపిస్తున్నాడు. గుంటూరు కారంలో మీడియం హెయిర్ లుక్‌తో కనిపించిన మహేశ్.. ఈ సారి మాత్రం లాంగ్ హెయిర్‌తో క్యాప్ పెట్టుకొని కనిపిస్తున్నాడు. కూతురు సితారతో ఛిల్ అవుట్ మూడ్‌లో ఉన్న సూపర్ స్టార్ స్టిల్ ఇప్పుడు టాక్ ఆఫ్ ది ఇండస్ట్రీగా మారింది. మొత్తానికి మహేశ్ బాబు ఈ సారి జక్కన్నతో భారీ ప్లానే చేస్తున్నాడని తెగ చర్చించుకుంటున్నారు తాజా స్టిల్ చూసిన అభిమానులు. మరి ఈ లుక్ వెనుకున్న సీక్రెట్‌పై మహేశ్ ఏదైనా హింట్ ఇస్తాడేమో చూడాలి. ఆఫ్రికన్ అడ్వెంచరస్ ప్రాజెక్ట్‌గా రాబోతున్న ఎస్ఎస్ఎంబీ 29 గురించి.. మిక్స్‌డ్ స్టిల్ షేర్ చేస్తూ.. క్యాప్షన్ లేదు.. ఫొటో చాలా మాట్లాడుతుంది.. ప్రీ ప్రొడక్షన్ వర్క్ కొనసాగుతోంది.. ఇప్పటికే ఆన్‌లైన్‌లో ఓ వార్త హల్ చల్ చేస్తోంది. దుర్గా ఆర్ట్స్ బ్యానర్‌పై కేఎల్ నారాయణ భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించనున్నారు.

ఇంటర్నేషనల్ యాక్షన్ డ్రామా నేపథ్యంలో రాబోతున్న ఈ మూవీలో పాపులర్ హాలీవుడ్ యాక్టర్‌తోపాటు వరల్డ్‌వైడ్‌గా ఉన్న స్టార్ యాక్టర్లు నటించబోతున్నారని ఇన్‌సైడ్ టాక్. ఈ సినిమా కోసం జక్కన్న టీం రామోజీఫిలిం సిటీలో ఏకంగా రూ.100 కోట్ల ఖర్చుతో భారీ సెట్ వేసినట్టు ఇప్పటికే నెట్టింట అప్‌డేట్స్ చక్కర్లు కొడుతున్నాయి.

# మీరు ఇస్తూ ఉండండి.. నేను చేస్తూ ఉంటా...



సమంత గొప్ప నటి. అందులో సందేహం లేదు. మనసు పెట్టి చేసిన ప్రతి సినిమాలో అద్భుతమైన నటన కనబరిచింది సామ్. ఇటీవల దర్శకుడు సుకుమార్ కూడా సమంతను ప్రశంసలతో ముంచెత్తారు. అంతేకాదు, జీవితకాల అవకాశాన్ని కూడా ఆమెకు ఆఫర్ చేశాడు. వివరాల్లోకెళ్తే.. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో సుకుమార్ మాట్లాడుతూ ' 'రంగస్థలం'లో రామలక్ష్మి పాత్రకు ముందు సమంతను అనుకోలేదు. హీరోహీరోయిన్లు ఇద్దరు సూపర్ స్టార్లయితే హ్యాండిల్ చేయలేనేమోనని భయపడ్డాను. అందుకే కొత్తమ్మాయితో చేయిద్దామనుకున్నా. కానీ కొన్ని కారణాల వల్ల సమంతను తీసుకోవాల్సి వచ్చింది. అయితే, లొకేషన్లో ఆమె నటన చూసి ఆశ్చర్యపోయాను. ఈ రోజు చెబుతున్నాను.. నేను సినిమాలు తీస్తున్నంతకాలం నా ప్రతి సినిమాలో సమంతను ఏదో ఒక పాత్రలో తీసుకుంటూనే ఉంటాను. తనుకు ఏ వయసు వచ్చినా ఆ వయసుకు తగ్గ పాత్ర ఇస్తూనే ఉంటాను.' అంటూ భారీ ఆఫర్ ఇచ్చేశారు. దీనిపై సమంత కూడా స్పందించారు. 'థాంక్యూ సుక్కూ సార్.. మీరిస్తూ ఉండండి.. నేను చేస్తూనే ఉంటాను' అంటూ ఆనందం వ్యక్తం చేసింది సమంత. దీన్నిబట్టి చూస్తే 'పుష్ప2'లో కూడా సమంత ఉన్నదని అర్థమవుతున్నది. 'పుష్ప'లో 'ఊ అంటావా.. మావా ఊ ఊ అంటావా..' అంటూ మెరుపులు మెరిపించిన సామ్.. మరి 'పుష్ప 2'లో ఎలా కనిపించనుందో చూడాలి.



# ఆమే ఒక సైన్యం..

సినీ సెలెబ్రిటీలు కూడా మరింత పాపులర్ కావడానికి సోషల్ మీడియాపై ఆధారపడుతున్న రోజులివి. అలాంటి సామాజిక మాధ్యమాల్లో కోట్ల మంది ఫాలోవర్లతో అదరగొడుతున్నది భారతీయ మోడల్, నటి అనుష్క సేన్. ఇన్‌స్టాలో తన అభిమానుల సంఖ్య ఇంతలంతలుగా పెంచేసుకుంటున్నది. ఈమెగారిని ఫాలో అవుతున్న వారి సంఖ్య నాలుగు కోట్లకు దగ్గరైంది. 'నాతోపాటే నా అభిమానుల సంఖ్య పెరుగుతూ వస్తున్నది. వాళ్లను నా సైన్యంగా భావిస్తాను. వారి ఆదరణే నాకు ఆత్మవిశ్వాసాన్ని, స్ఫూర్తిని ఇస్తుంది' అంటూ అభిమానులే తన బలం అంటున్నది అనుష్క సేన్. 'కాకపోతే, మనం ఓ రంగంలో అభిమానులను సంపాదించుకుంటుంటే మనకంటే పెద్దవాళ్లకు గిట్టకపోవచ్చని, అది మన స్నేహసంబంధాలపై ప్రభావం చూపుతుంద'ని చెప్పుకొచ్చింది. బాల్ వీర్, ఝాన్సీ కీ రాణి సీరియళ్లతో టెలివిజన్ ప్రేక్షకులను అలరించిన అనుష్క ఇప్పుడు ఓ కొరియన్ సినిమాలోనూ కనిపించనుంది. ఇన్‌స్టా అకౌంట్ ద్వారా తన గురించి తెలుసుకుని వాళ్లంతట వాళ్లే తనను వెతుక్కుంటూ వచ్చారని తెగ సంబురపడిపోతున్నది అనుష్క. ఈ ప్రాజెక్ట్ రావడానికి తన సోషల్ మీడియా పాపులారిటీ ఎంతగానో ఉపయోగపడిందని గొప్పగా చెప్పుకొంటున్నది.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com